# తాతా ఎక్కడికెళ్ళావ్ ?

చిట్టి పొట్టి స్కూలునుంచి వచ్చేదారిలో ఒక పచ్చ రంగు రెండతస్థుల మేడ వుంది. ఆ భవనం చూడటానకి చాలా అందంగా, హుందాంగా వుంటుంది. కాని ఆమేడ ఎప్పుడూ నిద్రపోతూ వుంటుంది. పసివాళ్ళ కేరింతలు, పిల్లల ఆటలసందడులు ఆమేడలో కనిపించవ్, వినిపించవ్.

ఆ మేడకి ముందు పెద్ద పొడుగాటి అరుగుంది. దానిపైన వయస్సునిండిన జీవితం పండిన పండు ముసలి వ్యక్తి కూర్చునుంటాడు. అతడికి మొహమంతా ముడతలతో నిండిపోయి పళ్ళూడిపోయి, వొళ్ళు వొడలిపోయి పిలుపు కోసం ఎదురుచూస్తున్నట్లు దీనంగా కూర్చునుంటాడు. అతడి మొహంలో తృప్తిగాని , శాంతిగాని చిరునవ్వుగాని ఎప్పుడూ కనిపించదు ! దేన్ని గురించో బాధపడుతున్నట్లుగా , గతాన్ని తల్చుకుని కుళ్ళిపోతున్న పండులా వుంటాడు.

అతడిపేరు మునుస్వామి . వయస్సులో వున్నప్పుడు అనేక వ్యవహారాలు, వ్యాపారాలు నడిపి బాగాగడించేడు . పొలాలు, ఇళ్ళు బ్యాంకు బాలన్సులు ఏర్పరిచి ఒక్కగానొక్క కొడుక్కి అప్పజెప్పాడు. తరం మారింది. ఆ కాలం గడిచింది మునుస్వామి హయాం పోయి, కొడుకు ఆదిపత్యం స్వీకరించేడు ! అంతా బాగానే ఉంది. కాని మునుస్వామికి ఒక్కటే లోటు,, ఒక ఒక్క కోర్కె .....మనవడ్ని ఎత్తుకోవాలని, ముద్దాడాలని , గుండెలపైని పడుకోపెట్టుకుని కథలు చెప్పాలని. కాని ఆ కోరికి తీరటం లేదు. కొడుక్కి సంతానం కలగటంలేదు. డాక్టర్లని , దేవుళ్ళని , జ్యోతిష్కులని ....అందర్ని ...వేడుకుని పూజించి , ప్రార్థించి అన్ని ప్రయత్నాలు చేసారు. కాని ఫలితం శూన్యం. చరమ దశలో మునుస్వామికి అదొక దిగులైపోయింది.

సరిగ్గా చిట్టి పొట్టి సంచులు భుజాల్న వేసుకుని స్కూలుకెళ్ళేవేళకి, మునుస్వామి అరుగు పైకి చేరతాడు. వెడుతున్న వాళ్ళిద్దరి వంక ప్రేమగా , ఆప్యాయంగా , అపురూపంగా చూస్తాడు. ఆయన చేతిలో రెండే రెండు చాక్లెట్లుంటాయ్. వాటిని వాళ్ళకి చూపిస్తూ – " పిల్లలూ – ఇంద – ఈ చాక్లెట్లు తీసుకోండి . మీ కోసమే తెచ్చా " అంటాడు బోసి నోటితో.

చిట్టి పొట్టి మొదటిరోజు కాస్తసందేహించారు. కాని క్రమక్రమంగా వాళ్ళిద్దరికి అలవాటైపోఇంది. ఆయన పిలవంగానే రివ్వున వెళ్ళి ఇద్దరూ చెరో ప్రక్కన చేరతారు. చాక్లెట్లు చప్పరిస్తూ కాస్సేపు కబుర్లు చెపుతారు. ఆయన వాళ్లచేత ' తాతా ' అనిపించకుంటాడు.

" తాతా మీకు మాలాంటి పిల్లల్లేరా – బిళ్ళలు మాకెందుకిస్తున్నావ్ " అంటాడు చిట్టి.

మునుస్వామి ముడతలుపడ్డ నోటిని తెరిచి " లేరుబాబు – అదేశాపం , పెద్ద శాపం " అంటాడు ఏదో గుర్తుకు తెచ్చుకుంటూ.

" అంటే దేవుడు శపించాడా – అయ్యో పాపం ఏం చేసావ్ " అనడుగుతాడు పొట్టి. కాని ఆ ప్రశ్నకి సమాధానం పైకి చెప్పడు లోపల్లోపలే గొణుక్కుంటాడు.

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం. సరిగ్గా ఈ భవనం కడుతున్నప్పుడే ఒక రోజు – లారీ వచ్చి ఇసుకని రోడ్డుపైకి కుమ్మరించి అప్పుడే వెళ్ళింది. భవనానికి పునాదితీసారు. మనుస్వామి దగ్గిరుండి పనిచేయించేవాడు . ఏదీ వృదాకానిచ్చేవాడు కాదు. లారీ వెళ్ళి పోయేక ఆయన బయటికొచ్చి చూసేసరికి , అయిదేళ్ళ పిల్లవాడు, ఎర్రగా వున్నాడు, ముద్దుగా వున్నాడు, బొద్దుగా వున్నాడు. ఆ ఇసుక దిబ్బనెక్కి ఆటలాడుతున్నాడు. అది చూసేసరికి మునుస్వామికి కోపంతో వొళ్ళు తెల్సింది కాదు. పెద్దగా అరుస్తూ చేతికందిన ఇటుక ముక్కని బలంగా విసిరాడు. ఆ పిల్లవాడికి అది వెళ్ళి ఎక్కడ తగిలిందో గాని అతడు అరుస్తూ, ఏడుస్తూ గిలగిల విలవిలా తన్నుకుని ..... ప్రాణాలు వదిలేడు.....

ఆరోజు యధావిధిన చిట్టి పొట్టి స్కూలు కెడుతూ ఆ పచ్చమేడ ముందు ఆగేరు. కాని మునుస్వామి ప్రతిరోజూ అరుగుపైని కూర్చుని లేడు పడుకునున్నాడు తల మాత్రం కనిపిస్తోంది. అంతటా తెల్లగుడ్డతో కప్పేరు. కాస్త దూరంలో నడివయస్సు వ్యక్తి సిగరెట్టు త్రాగుతూ పట్టనట్లు కూర్చున్నాడు.

చిట్టిపొట్టి. కాస్త ముందుకెళ్ళి చూసేరు. తాత చచ్చిపోయాడు. గుండెజల్లుమంది. వెళ్ళి పోవటానికి వెనక్కి తిరుగుతూ ఇద్దరు తెల్లగుడ్డలోంచి బయటికి కనిపిస్తున్న తాత గుప్పిటని గుప్పిట్లోని చాక్లెట్లని చూసేరు. .... కళ్ళు తుడచుకుని కదిలారు.

------- అయ్యిపోయింది -------